సాక్షి రంగారెడ్డి

గురువారం । 1 । జూన్ । 2023

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఏజీవర్సిటీ: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరా నికి గాను రెండేళ్ల పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశా నికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ జ్ఞానప్రకాష్ తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులై, టీఎస్ పాలిసెట్-2023 ఉతీర్ణులైన(అగ్రికల్చర్ స్ట్రీమ్)విద్యార్థులు అర్హులు. ఆసక్తిగల విద్యార్థులు జూన్ 19 లోపు విశ్వవిద్యా లయం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకో వచ్చని రిజిస్ట్రార్ సూచించారు.



పొగాకుతో వ్యాధులు

పొగాకు తో ప్రాణాంతక వ్యాధులు సోకుతాయ ని, పొగాకు నియంత్రణపై చెతన్యంకావాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. 8లో▸



ముగిసిన సీఎం కప్ పోటీలు

సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నాలుగు రోజు లుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. 8లో▸

న్యూస్‌రీల్

'అనువంశిక' హామీ అభినందనీయం

సీఎం కేసీఆర్‌కు చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగరాజన్ కృతజ్ఞతలు

మొయినాబాద్: అనువంశిక అర్చకుల సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇవ్వడం అభినందనీయమని ఆలయాల పరిరక్షణ ఉద్యమ కన్వీనర్, చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అనువంశిక అర్చకుల సమస్యలను క్యాబినెట్‌లో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. విప్రహిత బ్రాహ్మణ భవన సముదాయ ప్రారంభోత్సవ సభలో తాను కూడా అనువంశిక అర్చక సర్వీస్ రూల్స్‌ను తక్షణమే అమలు చేయాలని చెప్పానన్నారు. వంశపారంపరాగత అర్చకుల పద్ధతులను, తెలంగాణలో ముతవల్లి అనే వ్యవస్థలను ప్రభుత్వం నిలిపివేస్తే సంప్రదాయ దేవాలయాలు, గ్రామీణ దేవాలయాలు మూతపడతాయని 1996లో తన తండ్రి ఎంవీ సౌందరరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందించిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అర్చకులు, ఆలయ ఉద్యోగులకు పే స్కేల్‌లను విజయవంతంగా అమలు చేస్తుందని రంగరాజన్ ప్రశంసించారు.

ఐఎన్‌ఐ పరీక్ష ఫలితాల్లో షాద్‌నగర్ విద్యార్థి ప్రతిభ



డాక్టర్ పెండ్యాల సాయిజీవన్

షాద్‌నగర్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ (ఐఎన్‌ఐ) సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో సర్టిఫికెట్ కేర్ విభాగంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన విద్యార్థి డాక్టర్ పెండ్యాల సాయి జీవన్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో 14వ ర్యాంకు సాధించాడు. సాయి జీవన్ ప్రాథమిక విద్యను ఏపీలోని అనంతపూరు జిల్లా పుట్టపర్తిలో ఉన్న శ్రీ సత్యసాయి పాఠశాలలో పూర్తి చేశాడు. అనంతరం హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన ఆయన పాండిచ్చేరిలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. అనంతరం అనిస్తీషియాలో ఎండీ పూర్తి చేశాడు. డీఎం సూపర్ స్పెషాలిటీ కోసం ఐఎన్‌ఐ ప్రవేశ పరీక్ష రాసిన సాయి జీవన్ జాతీయ స్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

కుక్కపై మక్కువతో..

గాంధీఆస్పత్రి: తప్పిపోయి గాంధీ ఆస్పత్రికి చేరిన జర్మన్‌షెపర్డ్ జాతి శునకం తమదేనంటూ నలుగురు వ్యక్తులు బుధవారం గాంధీ సెక్యూరిటీ సిబ్బంది ఆశ్రయించారు. సదరు శునకం ఏ ఒక్కరినీ గుర్తు పట్టకపోవడం, పెట్టిన ఆహారం తినకపోవడంతో వాళ్లంతా నకిలీ యజమానులుగా నిర్ధారించారు. అయిదు రోజుల క్రితం గాంధీఆస్పత్రి ప్రాంగణానికి చేరిన జర్మన్‌షెపర్డ్ శునకాన్ని సెక్యూరిటీ సిబ్బంది చేరదీయగా.. యజమానిపై బెంగతో ఆహారం తీసుకోవడం లేదు. ఈ విషయాన్ని 'నువ్వు వస్తావని.. తప్పిపోయి గాం.దీకి చేరిన జర్మన్‌షెపర్డ్' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని చదివిన పలువురు స్పందించారు. కొందరు వైద్యులు శునకాన్ని దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో కుషాయిగూడ, ఈసీఐఎల్, నాంపల్లి, సికింద్రాబాద్ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు బుధవారం గాంధీ సెక్యూరిటీ సిబ్బందిని వేర్వేరుగా కలిసి తామే శునకం యజమానులమన్నారు. తమ శునకం తప్పిపోయి గాంధీ ఆస్పత్రికి చేరిందని ఫొటోలతో పాటు ఆయా ఠాణాల్లో కుక్క మిస్సింగ్ అంటూ చేసిన ఫిర్యాదు ప్రతులను చూపించారు. వీరిలో ఏ ఒక్కరినీ శునకం గుర్తు పట్ట లేదు. వారు పెట్టిన ఆహారం ముట్టకపోవడంతో అసలైన యజమానులు కాదని నిర్ధారణ కావడంతో వారిని నిలదీయగా, తాము అల్లారు ముద్దుగా పెంచుకున్న జర్మన్‌షెపర్డ్ శునకాన్ని పోలి ఉండడంతో వచ్చినట్లు చెప్పారని సెక్యూరిటీ చీఫ్ ఆఫీసర్ శివాజీ వివరించారు. జంతు సంరక్షణ చేపట్టే బ్లూక్రాస్ సంస్థకు అప్పగించనున్నట్లు తెలిపారు.

చల్లబడిన నగరం

సాక్షి, సిటీబ్యూరో: నగరం చల్లబడింది. బుధవారం మధ్యాహ్నం వరకు భానుడి భగభగలుండగా సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కొన్ని ప్రాంతాల్లో చల్లటి గాలులు, మరికొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఫిల్మ్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, కూకట్‌పల్లి, బాలానగర్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. కొద్దిపాటి వర్షానికి రోడ్ల మీదకు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ట్రాఫిక్ స్తంభించింది. కొద్దిరోజులుగా ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడుతున్న జనం వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.



సీఎం కప్‌లో భాగంగా సరూర్ నగర్ స్టేడియంలో కబడ్డీ ఆడుతున్న యువత

సీఎం కప్@ 2023

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్స హించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్-2023 రాష్ట్ర స్థాయి పోటీలు బుధవారంతో విజయవంతంగా ముగిశాయి. 33 జిల్లాల క్రీడాకారులకు ఎల్బీస్టేడియం వేదికైంది. యువతను ప్రోత్సహించేలా నిర్వహించిన క్రీడాపోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. – హుడాకాంప్లెక్స్



కబడ్డీలో తలపడుతున్న యువతులు

ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత

- దశాబ్ది ఉత్సవాలు అదిరేలా ఏర్పాట్లు
- ఒక్కో అంశంపై సభలు, సమావేశాలు, కరపత్రాల పంపిణీ
- తొమ్మిదేళ్లలో ఎంతో మార్పు.. ప్రగతి పథంలో రంగారెడ్డిజిల్లా
- పూర్తిగా ప్రజల్లోనే అధికారులు..ప్రజా ప్రతినిధులు ఉండేలా చర్యలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈనెల రెండో తేదీ నుంచి 22 వరకు ఇరవై రోజుల పాటు దశాబ్ది వేడుకలను వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శాఖల వారీగా సాధించిన ప్రగతిని ×నాడు-నేడు×శీర్షికతో ప్రజలకు వివరించాలని సూచించింది. ఆయా ప్రభుత్వ విభాగాధిపతులు, అధికారపార్టీ నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కలెక్టరేట్ సహా మున్సిపల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. జిల్లాలో సాధించిన పారిశ్రామిక ప్రగతి, అండర్‌పాస్ రోడ్లు, ఫ్లైఓవర్లు, లింకు రోడ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సహా పల్లె, పట్టణ ప్రగతిలో సాధించిన విజయాలను, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధించిన అవార్డులను ప్రజల కళ్లముందు ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ 22 రోజులు ఇటు అధికారులు, అటు అధికార ప్రజాప్రతినిధులు పూర్తిగా ప్రజల్లోనే ఉండేలా కార్యాచరణ రూపొందించారు.

రూపురేఖలు పూర్తిగా మారాయి: కలెక్టర్ హరీశ్



ఈ తొమ్మిదేళ్లలో రెవెన్యూ రంగంలో అనేక సంస్కరణలు వచ్చాయి. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ×ధరణి×పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, భూదాన్, భూముల లెక్క తేల్చింది. పట్టా భూములను పక్కాగా రికార్డు చేసింది. భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలోనూ అనేక మార్పులు తీసుకొచ్చింది. సర్వే నంబర్, భూ విస్తీర్ణం, పట్టాదారు పేరు వంటి అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పారదర్శకతకు పెద్దపీట వేసింది. ధరణి పోర్టల్‌కు జిల్లా వ్యాప్తంగా 1.90 లక్షల ఫిర్యాదులు అందగా, ఇప్పటికే 1.60 లక్షల దరఖాస్తులకు పరిష్కార మార్గం చూపించాం. కోర్టు కేసులు, ఇతర వివాదాలతో కూడినవి మాత్రమే అపరిష్కృతంగా మిగిలి ఉన్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 558 వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, కంపోస్ట్ యార్డులు, 83 రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలతో వాటి రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. మున్సిపాలిటీలు జీపీలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు దక్కాయి.

చీకటి నుంచి వెలుగులోకి.. ఆనంద్, సీజీఎం, టీఎస్పీడీసీఎల్



ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందు పరిశ్రమలకు పవర్ హాలీడేలు అమల్లో ఉండేవి. గృహ వినియోగదారులకు ఐదు నుంచి పది గంటలు కరెంట్ కోతలు అమలయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గృహ, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. 2018 జనవరి ఒకటి నుంచి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. గతంలో జిల్లా రోజు సగటు విద్యుత్ వినియోగం 12 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉండేది. ప్రస్తుతం 25 ఎంయూలకు పెరిగింది. అంతేకాదు తలసరి కరెంట్ వినియోగం 1,200 యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 2,250 యూనిట్లకు చేరింది. 2014కు ముందు జిల్లాలో 420 కేవీ సబ్‌స్టేషన్లు రెండు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య నాలుగుకు చేరింది. 220 కేవీ, 132 కేవీ, 11 కేవీ సబ్‌స్టేషన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

ఉపాధికి కేంద్ర బిందువు: రాజేశ్వర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ



మొదటి నుంచి పరిశ్రమలకు కేంద్ర బిందువుగా నిలిచిన రంగారెడ్డిజిల్లా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత మరింత వేగంగా అభివృద్ధి సాధించింది. శంషాబాద్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్స్ జోన్లలో 24 పారిశ్రామిక వాడలు ఉన్నాయి. 2014కు ముందు జిల్లాలో చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలు 2,777 ఉండగా, వీటిలో 45,763 మందికే ఉపాధి లభించేది. తర్వాత కొత్తగా రూ.14,686.2కోట్ల పెట్టుబడులతో 1183 యూనిట్లు వెలిశాయి. కొత్తగా మరో 67,664 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించే ప్రఖ్యాత ఫాక్స్‌కాన్ సంస్థకు ఇటీవల కొంగరలో భూమి పూజ కూడా చేసుకున్నాం. ప్రభుత్వ చొరవ, జిల్లా అధికారుల కృషితోనే ఇదంతా సాధ్యమైంది.

సుభిక్షంగా రైతు: గీతారెడ్డి, వ్యవసాయశాఖ అధికారి



ఉమ్మడి ఏపీలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. సాగు, తాగు నీటి కోసం అల్లాడేవారు. కరెంట్ కోసం పడిగాపులు తప్పేవి కావు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత రైతుల ముఖాల్లో ఆనందం వెల్లి విరిసింది. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలోని 2,100 చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు వాటి కింద సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. 2018 నుంచి రైతుబంధు పథకం అమల్లోకి వచ్చింది. మొదట్లో ఈ పథకం కింద 2,47,696 మంది రైతులకు రూ.255.29 కోట్లు చెల్లించింది. 2022 వానాకాలం నాటికి రైతుల సంఖ్య 3,04,111కు చేరగా, బడ్జెట్ రూ.343.97 కోట్లకు చేరింది. జిల్లాలో 83 రైతు వేదికలతో పాటు వ్యవసాయ విస్తరణాధికారులు అందుబాటులోకి వచ్చారు. ప్రమాదవశాత్తు చనిపోయిన రైతుకు రైతుబీమా పథకం తీసుకొచ్చింది. ఇప్పటి వరకు జిల్లాలో 479 మంది రైతులకు జీవిత బీమా డబ్బులు అందజేశాం.



మల్లారెడ్డిగూడలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

పల్లెల ప్రగతికి నిధులు

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి హామీ

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పల్లెల రూపురేఖలు మారాయని జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం మల్లారెడ్డిగూడ, ఎర్రోని కొటాల గ్రామాల్లో డ్వాక్రా భవనం, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి దండిగా నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఒక్కప్పుడు గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లేవారని, ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధితో పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చి ఉండే పరిస్థితి నెలకొందని చెప్పారు. గ్రామాల్లో పల్లె ప్రగతి, హరితహారం కార్యక్రమాలు గ్రామాల రూపురేఖలు పూర్తిగా మార్చేశాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. శుభోదయంతో గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. కొత్త పంచాయతీగా ఏర్పడిన మల్లారెడ్డిగూడ గ్రామాన్ని సర్పంచ్ చొరవ తీసుకొని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచ్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ కావలి రవీందర్, వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, ముడిమ్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్ర మల్లేశ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న విదేశీ కరెన్సీని ఎయిర్‌పోర్టులో అధికారులు స్వా.దీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ ఫరాన్ అనే మహిళ బుధవారం ఉదయం 6ఈ-1421 విమానంలో షార్జా బయలుదేరేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. సీఐఎస్‌ఎఫ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 30 సౌదీ రియాల్ బయటపడ్డాయి. భారత కరెన్సీలో వీటి విలువ 6.61లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాలను బహిష్కరిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: దశాబ్ది ఉత్సవాలను బహిష్కరించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పేర్కొన్నారు. బుధవారం ఓయూలో వివిధ సంఘాలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబం దోపిడీకి గురై అప్పుల పాలైందన్నారు. శుక్రవారం నుంచి నిర్వహించనున్న ఉత్సవాలను బహిష్కరించాలన్నారు. సమావేశంలో ఉద్యమ నాయకులు డాక్టర్ ధాత్రిక స్వప్న, మల్లేశ్, ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ విజయ్, బీఎస్ఎఫ్ నేత బొర్రెల్లి సురేశ్ పాల్గొన్నారు.

మహాగణపతి @ 61 అడుగులు

ఈ ఏడాది మట్టి వినాయకుడి ఎత్తు ఇది

- ఖైరతాబాద్ విగ్రహ తయారీ పనులకు కర్రపూజతో శ్రీకారం
- వారం రోజుల్లో నమూనా విడుదల



ఖైరతాబాద్ మహా గణపతి కర్ర పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి అంటేనే ప్రత్యేకతలకు నిలయం. గత ఏడాది 60 అడుగుల ఎత్తులో దర్శనమిచ్చిన మహాగణపతి ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 61 అడుగులతో భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం నిర్వహించిన కర్రపూజా కార్యక్రమంలో తెలిపారు. ప్రతి యేటా ఖైరతాబాద్ మహాగణపతి తయారీ పనులకు మూడు నెలల ముందే నిర్జల ఏకాదశి రోజు కర్రపూజ నిర్వహించి పనులను ప్రారంభిస్తారు. అదే ఆనవాయితీగా బుధవారం సాయంత్రం ఖైరతాబాద్ మహాగణపతి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కర్రపూజతో విగ్రహ తయారీ పనులకు శ్రీకారం చుట్టారు.

- 69వ సంవత్సరం సందర్భంగా ఈసారి ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి సుదర్శన్‌కు అంకితమిస్తూ 61 అడుగుల మట్టి వినాయకుడిని తయారుచేయాలని నిర్ణయించినట్లు కన్వీనర్ సందీప్‌రాజ్ తెలిపారు. వారం రోజుల్లో మహాగణపతి నమూనాను విడుల చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. గత సంవత్సం లాగానే ఈ సంవత్సరం శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్, ఆర్టిస్టు జోగారావు నేతృత్వంలో మట్టి మహాగణపతి తయారు చేయనున్నట్లు ఆయన చెప్పారు.
- కర్రపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఖైరతాబాద్ మహాగణపతి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వినాయక ఉత్సవాలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటి కార్యదర్శి భగవంతరావు, ఉపాధ్యక్షుడు కరోడిమల్, లైబ్రరీ చైర్‌పర్సన్ ప్రసన్న, గణేష్ ఉత్సవ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరి సింగరి రాజ్‌కుమార్, దీక్షా చైర్మన్ హన్మంతరావు, దైవాజ్ఞశర్మ, డీసీపీ వెంకటేశ్వర్లు, అడిషనల్ డీసీపీ రమణారెడ్డి, ఏసీపీ సంజీవ్‌కుమార్, సీఐలు సత్తయ్య, నిరంజన్‌రెడ్డి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్‌ది ఆత్మహత్యే

కలిసే చనిపోదామని భావించిన ప్రేమికులు

- కడసారిగా పిల్లల్ని చూసి వస్తానని ఇంటికెళ్లిన టీచర్
- ఆమె ఎంతకూ రాకపోవటంతో రాజేశ్ బలవన్మరణం
- కేసు దర్యాప్తులో వాస్తవాలు వెల్లడి: పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: హయత్‌నగర్‌లో కలకలం రేపిన ములుగు జిల్లాకు చెందిన అల్లెపుల రాజేశ్ (24) మృతి కేసులో హయత్‌నగర్ పోలీసులు పురోగతి సాధించారు. తొలుత హత్యగా భావించిన పోలీసులు రాజేశ్‌ది ఆత్మహత్యేనని నిర్ధారణకు వచ్చారు. రాజేశ్‌తో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిది కూడా ఆత్మహత్యేనని, ఇద్దరు కలిసే చనిపోదామని నిర్ణయించుకున్నారని పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ప్రేమించి, తనతో కలిసి జీవితాన్ని పంచుకోలేనని తెలిసి, జీర్ణించుకోలేక రాజేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు హయత్‌నగర్ పోలీసులు తేల్చారు. పెళ్లి కాలేదని తనని మోసం చేసిందని భావించిన రాజేశ్, ప్రేమించిన వ్యక్తి దూరం పెట్టడంతో తట్టుకోలేని టీచర్ బలవర్మరణాలకు పాల్పడినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరులోని డాక్టర్స్ కాలనీ సమీపంలో ఈ నెల 29న కుళ్లిపోయిన స్థితిలో రాజేశ్ మృతదేహం లభించిన సంగతి తెలిసిందే.

అసలేం జరిగిందంటే..

హయత్‌నగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం మిస్డ్ కాల్ ద్వారా పరిచయమైన ఉపాధ్యాయురాలు వాట్సాప్ డీపీ ఫొటో చూసిన రాజేశ్ ఆమెతో ప్రేమలో పడ్డాడు. మరోవైపు రాజేశ్ చురుకుదనానికి ఆమె సైతం ఇందుకు సరేనంది. వీరిద్దరు కలిసి హైదరాబాద్, నల్లగొండలోని పలు ప్రాంతాల్లో తిరిగారు. టీచర్‌ను పెళ్లి చేసుకుందామని భావించిన రాజేశ్‌కు.. అప్పటికే ఆమెకు వివాహమైందని, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారన్న విషయం కొంత కాలం తర్వాత తెలిసింది. దీంతో రాజేశ్ ఆమెను దూరం పెట్టాడు. దీన్ని తట్టుకోలేకపోయిన టీచర్.. మాట్లాడుకుందామని చెప్పడంతో ఇరువురూ కలిశారు.

చివరి సారిగా పిల్లలను చూద్దామని..

కలిసి జీవించలేమని భావించిన రాజేశ్, టీచర్ విషం తాగి చనిపోదామని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మే 24న హయత్‌నగర్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేశారు. ఇద్దరం కలిసే చనిపోదామని శివారు ప్రాంతానికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆఖరిసారిగా పిల్లలను కళ్లారా చూసుకుంటానని రాజేశ్‌తో చెప్పి, టీచరు హయత్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్లిపోయింది. పిల్లలతో కాసేపు గడిపి.. వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందింది.

- తిరిగివస్తానని ఇంటికి వెళ్లిన టీచర్ ఎంతకీ రాకపోవటంతో రాజేశ్ ఆమె వాట్సాప్‌నకు సందేశాలు, ఫోన్లు చేశాడు. ఆమె సెల్‌ఫోన్‌ను గమనించిన మృతురాలి కూతురు ఈ విషయాన్ని తన తమ్ముడికి చెప్పింది. దీంతో టీచర్ కుమారుడు.. రాజేశ్ ఉన్న ప్రాంతానికి వెళ్లి మందలించాడు. తాను ప్రేమించిన టీచర్ మృతి చెందిందన్న విషయం తెలుసుకున్న రాజేశ్.. వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన తర్వాత శరీరం మంటలెక్కడం, వికారం వంటి లక్షణాలకు గురవుతుందని, ఈ క్రమంలోనే రాజేశ్ తన ఒంటి మీద దుస్తులు విప్పి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- దురలవాట్లకు దూరంగా ఉండాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: పొగాకు తీసుకోవడంతో ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని, పొగాకు నియంత్రణపై మనమందరం చైతన్యంకావాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మానవులు వివిధ రకాల పొగాకు ఉత్పత్తులను తీసుకుంటున్నారని, దీంతో అనేక రకాల జబ్బులు, ప్రాణాంతకమైన వ్యాధులకు గురవుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. సిగరెట్స్, బీడీలు తాగడం, జర్దాలు, పాన్ పరాగ్‌లు తినడం మానుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుల సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు నర్సింలు, శేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నాటకాన్ని చూసేందుకు వెళ్లిన వృద్ధుడు..

రైలు కిందపడి దుర్మరణం


హన్మంత్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: గ్రామంలో ప్రదర్శిస్తున్న నాటకాన్ని చూసేందుకు వెళ్లిన వృద్ధుడు రైలు కింద పడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామానికి చెందిన హన్మంతు(63)కు మతిస్థిమితం సరిగా లేదు. మంగళవారం రాత్రి గ్రామంలో నిర్వహించిన నాటికను చూసేందుకు వెళ్తున్నాని చెప్పాడు. ఉదయం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ శివారులోని రైల్వే పట్టాలపై విగతజీవిగా కన్పించాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

అనుమానాస్పదంగా కూలీ మృతి


రోహిత్‌కుమార్ మృతదేహం

షాబాద్: అనుమానాస్పదంగా కూలీ మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువయ్యగౌడ్ తెలిపిన ప్రకారం.. షాబాద్‌కు చెందిన తొంట వెంకటయ్య దైవాలగూడకు వెళ్లే దారిలో ఓ ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నాడు. నగరంలోని ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ షబ్బీర్‌కు కాంట్రాక్ట్ ఇచ్చాడు. సదరు కాంట్రాక్టర్ నెలరోజులుగా ఐదురుగు లేబర్‌లను పెట్టి పనులు చేయిస్తున్నాడు. ఇటీవల ముగ్గురు లేబర్‌లు వెళ్లిపోగా రహీంఖాన్, రోహిత్‌కుమార్‌లు మాత్రమే పని చేస్తున్నారు. బుధవారం ఉదయం విధులకు వెళ్లే వరకు రోహిత్‌కుమార్ తలకు బలమైన గాయమై మృతి చెందాడు. వెంటనే వాచ్‌మెన్ ఫంక్షన్ హాల్ ఓనర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. రహీంఖాన్ రోహిత్‌కుమార్‌ను దాడి చేసి చంపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రహీంఖాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ గురువయ్యగౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఇనుప చువ్వల దొంగలకు రిమాండ్


రిమాండ్‌కు తరలించిన నేరస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: రెండు టన్నుల ఇనుప చువ్వలను దొంగిలించిన ఐదుగురు దుండగులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన పోలేపల్లి జగదీశ్వర్ తన ఇంటి నిర్మాణానికి రెండు టన్నుల ఇనుప చువ్వలను తీసుకుని ఆరుబయట వేశాడు. మే 26 అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప చువ్వలను అపహరించారు. దీంతో బాధితుడు మే 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా గౌరెల్లి గ్రామానికి చెందిన సంపంగి వెంకటేశ్, సల్లంగుల నిరంజన్, దండుగుల వెంకటేశ్, ఓర్సు సురేశ్, జరపాటి నాగరాజులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు దొంగిలించినట్లు అంగీకరించారు. ఈ ఐదుగురు నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

- రాష్ట్ర స్థాయి కబడ్డీలో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన జిల్లా జట్లు
- వాలీబాల్‌లో కాంస్య పతకాలు
- బహుమతులు అందజేసిన మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే భగత్, శాట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్


విజేతలతో మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే భగత్, శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయులు తదితరులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నాలుగు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్-2023 క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్, జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహించగా, వీటిలో 33 జిల్లాల నుంచి 1,550 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నాగార్జున సాగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయులు గౌడ్, డిప్యూటీ డైరెక్టర్ ధనలక్ష్మి, సంగారెడ్డి డీఆర్‌డీఓ శ్రీనివాస్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ ఈ బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు

- కబడ్డీ మహిళా విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టుపై నల్గొండ జిల్లా జట్టుపై విజయం సాధించి గోల్డ్‌మెడల్ సొంతం చేసుకుంది. రెండో స్థానంలో నిలిచిన నల్గొండ క్రీడాకారులు సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. హైదరాబాద్, ఖమ్మం జట్లు సంయుక్త కాంస్య విజేతలుగా నిలిచాయి. పురుషుల విభాగంలో సూర్యాపేట జిల్లా జట్టుపై రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు విజయం సాధించి గోల్డ్‌మెడల్‌ను కై వసం చేసుకున్నారు. రెండో బహుమతిని సూర్యాపేట జట్టు గెలుచుకోగా, మూడో బహుమతిని మేడ్చల్, నల్లగొండ జట్లు కై వసం చేసుకున్నాయి.
- వాలీబాల్ మహిళా విభాగంలో మహబూబాబాద్‌పై నల్లగొండ జట్టు విజయం సాధించింది. నల్గొండ జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, మహబూబాబాద్ జట్టు ద్వితీయ బహుమతిని సొంతం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా తృతీయ బహుమతిని గెలుచుకుంది. పురుషుల విభాగంలో మెదక్ జిల్లాపై మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించి గోల్డ్‌మెడల్‌ను కైవసం చేసుకోగా, మెదక్ జిల్లా సిల్వర్, రంగారెడ్డి జిల్లా జట్టు కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

విజేతల వివరాలు

క్రీడ	మొదటి	ద్వితీయ	తృతీయ
జిమ్నాస్టిక్స్ ఫ్లోర్ ఎక్సైజ్ (పురుషుల)	పి.విశాల్ జాదవ్, రంగారెడ్డి	వి. పవన్ కుమార్, రంగారెడ్డి	పి.సూర్యదేవ్, వరంగల్
జిమ్నాస్టిక్స్ పామ్మెల్ హార్స్ (పురుషుల)	యల్. సిద్దు వరప్రసాద్, మేడ్చల్	టి.శివసాయి, హనుమకొండ	వి .పవన్ కుమార్, రంగారెడ్డి
జిమ్నాస్టిక్స్ రోమన్ రింగ్స్ (పురుషుల)	పి.సూర్యదేవ్, వరంగల్ జిల్లా	ఈ.ప్రశాంత్, మహబూబాబాద్	పి.విశాల్ జాదవ్, రంగారెడ్డి
జిమ్నాస్టిక్స్ టేబుల్ వాయుల్ట్ (పురుషుల)	బి.క్రాంతి కుమార్, హైదరాబాద్	జి విజయ్ కుమార్, మహబూబ్‌నగర్	సిహెచ్. హిమంత్, హనుమకొండ
జిమ్నాస్టిక్స్ టేబుల్ వాయుల్ట్ (మహిళ)	సురభి ప్రసన్న రంగారెడ్డి	కీర్తి ఆనంద్, రంగారెడ్డి	లక్ష్మి పూజిత, మేడ్చల్
జిమ్నాస్టిక్స్ అల్ఇన్‌వన్ బార్ (మహిళ)	నిషిక అగర్వాల్, హైదరాబాద్	కీర్తి, రంగారెడ్డి	అనూష, వరంగల్
జిమ్నాస్టిక్స్ బ్యాలన్సింగ్ బీమ్ (మహిళ)	నిషిక అగర్వాల్, హైదరాబాద్	పౌనమి దాస్ , మేడ్చల్	ప్రత్యూష, మహబూబాబాద్
జిమ్నాస్టిక్స్ ఫ్లోర్ ఎక్సర్సైజ్ (మహిళ)	పి. సురభి ప్రసన్న, రంగారెడ్డి	హన్సిక బిహాల్, రంగారెడ్డి	లక్ష్మి పూజిత , మేడ్చల్ జిల్లా

ప్రతిభను చాటాలి

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం. గెలిచిన వారు పొంగిపోవొద్దు. ఓటమి పాలైన వారు కుంగిపోవద్దు. గెలుపు కోసం మళ్లీ ప్రయత్నించాలి. నిత్యం ప్రాక్టీస్ చేయడంతోనే విజయం సాధ్యం. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు ఐకమత్యాన్ని చాటుతాయి. క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. క్రీడాకారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి. ఒలింపిక్స్, కామన్‌వెల్త్ వంటి క్రీడాపోటీల్లో రాష్ట్ర ప్రతిభను చాటాలి.

– గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్

క్రీడలకు ప్రోత్సాహం

తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం కల్పిస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోనూ మైదానాలు ఏర్పాటు చేసింది. ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందజేస్తుంది. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆడుకుంటూ చదువుకుంటే ఉన్నత స్థానాల్లో స్థిరపడొచ్చు. క్రీడాకారులు తమ తల్లిదండ్రులకే కాకుండా దేశానికి మంచి పేరు తీసుకురావాలి.

– నోముల భగత్‌కుమార్,
ఎమ్మెల్యే, నాగార్జునసాగర్

గ్రౌండ్ బాట పట్టాలి

దేవుడు ఇష్టపడే అద్భుతమైన వ్యక్తులు క్రీడాకారులు. మే అంటే మండే ఎండలు కాదని, మే అంటే మా యువతరం మెరుపులు. తెలంగాణ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటే నైపుణ్యం ఉంది. జూన్‌లో బడి బాటలాగే.. యువకులు అందరూ గ్రౌండ్ బాట పట్టాలి. తెలంగాణ బిడ్డలను, అన్ని విభాగాలను విజేతలుగా నిలపడం కోసం సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారు. క్రీడలలో అద్భుతమైన జీవితం ఉందని, గుడిని, బడిలాగే గ్రౌండ్‌ని గౌరవించేలా చైతన్యం చేయాలి. అప్పుడే గ్రామాలకు అందమైన ఆరోగ్యం దక్కుతుందన్నారు.

– డాక్టర్ ఆంజనేయగౌడ్, శాట్స్ చైర్మన్

అటెండర్ బలవన్మరణం


రాజు (ఫైల్)

శంకర్‌పల్లి: ఫిట్స్ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణ శివారులో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మహరాజ్‌పేట్ గ్రామానికి చెందిన రాజు(42) మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో ఆయన మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కాగా పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేయనున్నట్లు వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

నందిగామ: ఆటోను కారు ఢీ కొట్టిన ఘటనలో ఆటో పాక్షికంగా ధ్వసమవ్వగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని నందిగామ శివారులో నూజివీడు సీడ్స్ పరిశ్రమ సమీపంలో పాతజాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నందిగామకు చెందిన సాలె శ్రీను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం నందిగామ నుంచి కొత్తూరు వైపు వెళ్తుండగా.. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు అద్దాలు పగిలి ధ్వంసమవ్వగా ఆటో డ్రైవర్ శ్రీను తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బొడ్రాయి పండుగ రోజునే విషాదం

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


శ్రీశైలం మృతదేహం

కేశంపేట: గ్రామస్తులంతా బొడ్రాయి ఉత్సవాల్లో ఉండగా.. రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో కాకునూర్‌లో విషాదఛాయలకు అలముకున్నాయి. గ్రామానికి చెందిన మాదాపురం శ్రీశైలం బైక్‌పై వెళ్తుంగా కేశంపేట శివారులో అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో శ్రీశైలం రోడ్డు పక్కన్న ఉన్న చెట్ల పొదల్లో పడి మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం సంఘటన చోటుచేసుకోగా సాయంత్రం వరకూ గుర్తించలేదు. సాయంత్రం గమనించిన వ్యక్తులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఏబీవీపీ జాతీయ కార్యదర్శి హరికృష్ణ

షాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని సందార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన ఏబీవీపీ కార్యకర్త శ్రీకాంత్ హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముట్టడి లాఠీచార్జీలో గాయపడగా బుధవారం ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురునానక్, శ్రీనిధి వర్సిటీలు అనుమతులు లేకుండా నడిపించడంతో 4 వేల మంది విద్యార్థులు రోడ్డున పడ్డారన్నారు. ఉన్నత విద్యామండలి ఎదుట శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అక్రమంగా అరెస్టులు చేసి కేసులు పెట్టి దాడి చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేని యూనివర్సిటీలకు సెక్యూరిటీ కల్పిస్తూ విద్యార్థి నాయకులపై దాడులు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రాంత సంఘటన కార్యదర్శి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి శ్రీకాంత్, శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్, జిల్లా కన్వీనర్ మహేశ్, నాయకులు మణికంఠ, ప్రదీప్, మహేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి వచ్చి వెళ్తుండగా ..

- ఆటో బోల్తా
- నలుగురికి గాయాలు
- డ్రైవర్, బాలుడి పరిస్థితి విషమం


బోల్తా పడిన ఆటో

కేశంపేట: వివాహానికి వచ్చి బంధువులతో సంతోషంగా గడిపి తిరిగి వెళ్తుండగా అంతలోనే ఆటో ప్రమాదం విషాదాన్ని నింపింది. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పలుగుతండాకు చెందిన వారు కొత్తూరు మండలంలోని వైఎం తండాలో జరుగుతున్న పెళ్లికి వచ్చారు. వారి తిరుగు ప్రయాణంలో ఆటోను డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో అల్వాల శివారులోని కల్వర్టు దిమ్మెలకు ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ రూప్‌సింగ్‌తో పాటు బాలుడు అర్జున్‌కు తీవ్రగాయాలవ్వగా సాలి, బుజ్జి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పెట్రోలింగ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

పెళ్లి కాకుండానే తల్లిని చేసి..

- ప్రేమ పేరుతో యువకుడి మోసం
- మగబిడ్డకు జన్మనిచ్చిన యువతి
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

శంకర్‌పల్లి: ప్రేమ, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పిన యువకుడు ఓ యువతిని తల్లిని చేసి ముఖం చాటేశాడు. ఈ ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్ కాలనీలో మోకిల గ్రామానికి చెందిన బాధిత యువతి(20) కుటుంబం రెండేళ్లుగా కిరాయికి ఉంటున్నారు. ఇంటి ఓనర్ కుమారుడు కార్తీక్(24) యువతితో పరిచయం పెంచుకున్నాడు. ఏడాది కాలంగా యువతితో ప్రేమలో ఉన్న యువకుడు ఆమెను గర్భవతిని చేశాడు. ఇరు కుటుంబీకుల మధ్య గొడవలు జరిగాయి. కాగా మే 24న యువతి మగ బిడ్డకు జన్మనిచ్చింది. కార్తీక్ కుటుంబ సభ్యులు పెళ్లికి ఒప్పుకోకపోవడంతో బాధితురాలు బుధవారం శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

కామన్వెల్త్, ఒలింపిక్స్‌లో రాణించాలి

శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

వెంగళరావునగర్: రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులందరూ భవిష్యత్‌లో కామన్వెల్త్, ఒలింపిక్స్ క్రీడల్లో రాణించాలని శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నాలుగురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన సీఎం కప్-2023 పోటీల్లో వేలాది మంది వివిధ జిల్లాల నుంచి హాజరయ్యారన్నారు. యువత తమకు నచ్చిన క్రీడల్లో ట్రైనింగ్ తీసుకుంటే రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురాగలుగుతారన్నారు. అనంతరం ఫైనల్స్‌లో విజయం సాధించిన హైదరాబాద్ మెన్స్ అండ్ ఉమెన్స్ జట్లకు ఆయన ట్రోఫీలను అందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి డీఆర్‌డీఓ ప్రభాకర్, సంగారెడ్డి డిప్యూటీ ఎస్‌ఓ రామచందర్, స్టేడియం ఇన్‌చార్జి జి.రవీందర్‌లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, జీహెచ్ఎంసీ, టూరిజం తదితర శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.